## క్లుప్తంగా

### 6న స్పాట్ కౌన్సెలింగ్

**ఇచ్చోడ:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గురుకుల బాలుర, బాలికల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈనెల 6న ఉట్నూర్‌లోని లాల్‌టెక్డి కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఇచ్చోడ గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల గిరిజన బాలబాలికలు మెమో, బొనఫైడ్, టీసీ, కుల, ఆదాయ, ఫిజికల్, ఫిట్‌నెస్, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలతో పాటు 4 పాస్‌ఫోటోలతో స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

### మోడల్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

**బోథ్:** ఇటీవల విడుదలైన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలో మండలంలోని సొనాలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. డి.బాహుబలి, బి.నవ్యశ్రీ, బి.సాత్విక్, డి.నిఖిల్‌లు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రడాపు మధుసూదన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

### జవాను మృతిపై సంతాపం

**బోథ్:** తమ మిత్రుడు జవాన్ రాజశ్వర్ మృతి పట్ల తోటి స్నేహితులు సంతాపం తెలిపారు. సిరికొండ మండలానికి చెందిన రాజేందర్ చిన్నతనంలో బోథ్‌లో విద్యాభ్యాసం చేశాడు. తమతో చదివిన జవాన్ రాజేశ్వర్ కాన్పూర్‌లో హఠాత్తుగా మృతి చెందడంతో తోటి స్నేహితులు శోక సముద్రంలో మునిగిపోయారు.

### పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎంపీ గోడం నగేశ్

**ఇంద్రవెల్లి:** మండల కేంద్రంలోని ప్రముఖవ్యాపారి ఇటీవల అనారోగ్యంతో ఆస్ట్రేలియాలో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ గోడం నగేశ్ సోమవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని మృత్యుడు జన్నవార్ కిశోర్ ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వ్యాపారస్తులు సంతోష్ చింతవార్, దిపక్ చింతవార్, మెస్రం తుకారం, కనక తుకారం, కనక హనుమంత్‌రావ్, తదితరులు ఉన్నారు.

**నేరడిగొండ:** మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన కమల్‌సింగ్ మాతృమూర్తి ఇటీవలే మృతి చెందారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం వారి నివాసానికి చేరుకొని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

**తలమడుగు:** మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన గుమ్ముల ఆశన్న కుటుంబసభ్యులను సోమవారం జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి పర్మామర్శించారు. గుమ్ముల ఆశన్న 15 రోజుల క్రితం కాశీయాత్రకు వెళ్లి తప్పిపోయాడు. ఇప్పటివరకు ఆచూకీ దొరకలేదు. విషయం తెలుసుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సుంకిడి ఎంపీటీసీ వెంకన్న యాదవ్, శ్రీను, గ్రామస్తులు ఉన్నారు.

### అమ్మవారికి సారె సమర్పణ



సారె సమర్పిస్తున్న మహిళలు

**ఖానాపూర్:** మండలంలోని తర్లపాడ్ గ్రామంలోని ఓంకారేశ్వర ఆలయంలో పార్వతి దేవి అమ్మవారికి సోమవారం మహిళలు సారెను సమర్పించారు. పట్టణంలోని శ్రీశైవక్షేత్ర వనితాశక్తి ఆధ్వర్యంలో 'మనసారె మనసారా మన అమ్మకు' కార్యక్రమంలో భాగంగా అర్చకులు హరీశ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి చీరె, సారెను సమర్పించారు. జితేందర్, మాధవి, వాసవి, సరిత, గీతారాణి, రాధిక, మానస, స్రవంతి తదితరులు ఉన్నారు.

### గ్రంథాలయంలో సమస్యలు పరిష్కరిస్తాం

**ఖానాపూర్:** పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని పాఠశాల భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయంలోని సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలోని గ్రంథాలయాన్ని సోమవారం సందర్శించారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు, పాఠకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి వసతి, పారిశుధ్య లోపం ఇతర సమస్యలను పరిష్కరిస్తానని హామీఇచ్చారు. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# కాడెడ్లు కనుమరుగు

- ట్రాక్టర్ల ద్వారానే వ్యవసాయ పనులు
- రైతులపై పెరిగిన ఆర్థిక భారం
- రుతుపవనాల రాకతో ఊపందుకున్న వ్యవసాయ పనులు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నిస్తున్న రైతు

**తాంసి:** వ్యవసాయ పనుల్లో అన్నదాతకు అసరా ఉండే కాడెడ్లు కనుమరుగయ్యాయి. యంత్రాలు, ట్రాక్టర్ల వాడకం పెరిగిపోవడంతో పంటల సాగు రైతులకు భారంగా మారుతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో వ్యవసాయం చేసి కుంటుంబాలను నెట్టుకొస్తున్నారు. పశుపోషణ భారంగా మారడంతో యంత్రాల వాడకం పెరగడంతో కాడెడ్లు వ్యవసాయ పనులకు దూరమయ్యాయి. ట్రాక్టర్ల యజమానులు గంటకు రూ.1200 నుంచి రూ.1500 వరకు డిమాండ్ చేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆర్థికంగా భారమైనా.. వ్యవసాయ పనులు చేయిస్తున్నారు.

**భారం పశుపోషణ..**

పశుపోషణ భారంగా మారడంతో రోజురోజుకూ వ్యవసాయంలో కాడెద్దుల వినియోగం తగ్గుతోంది. ఒకప్పుడు ప్రతీ గ్రామంలో అధికశాతం రైతుల కుటుంబాల్లో కాడెద్దులు ఉండగా.. వాటితో పనులు చేయించేవారు. ప్రస్తుతం వ్యవసాయంలో పనులు చేపట్టేందుకు కాడెద్దులు కనిపించడం లేదు. అలాగే రైతులు పెంపకానికి అంతగా ఆసక్తి చూపించడం లేదు. ఏ గ్రామాల్లో చూసినా.. ట్రాక్టర్ల వినియోగం పెరిగింది.

**పెరిగిన యంత్రాల వాడకం..**

వ్యవసాయ పనులను కూలీలపై ఆధారపడకుండా ట్రాక్టర్ల ద్వారా చేపడుతున్నారు. పత్తి కర్రలను తొలగించేందుకు ఎకరానికి రూ.800 నుంచి రూ.1000 వరకు చెల్లిస్తున్నారు. దుక్కి దున్నేందుకు ఎకరానికి రూ.1200 నుంచి రూ.1500 వరకు చెల్లించాల్సి వస్తుంది. విత్తనాలు వేసే సమయంలో భూమిని చదును చేయడానికి రోటవేటర్ కోసం ఎకరానికి రూ.1000 నుంచి రూ.1400వరకు చెల్లిస్తున్నారు. గ్రామాల్లో ఒకసారిగా ట్రాక్టర్ల డిమాండ్ పెరగడంతో కాడెద్దుల అవసరం లేకుండా వ్యవసాయ పనులు సాగుతున్నాయి.

#### ట్రాక్టర్‌తోనే అన్ని పనులు



గతంలో కాడెద్దులకు అరకకు కట్టి వ్యవసాయ పనులు చేసేవాళ్లం. పత్తి కర్రలు తొలగించడం మొదలుకొని దుక్కి దున్నడం, చదును చేయడం కాడెద్దుల ద్వారా చేసేవాళ్లం. ఇప్పుడు ట్రాక్టర్‌ను వినియోగించాల్సి వస్తోంది.

– వికాస్ రెడ్డి, రైతు, జామిడి

#### ట్రాక్టర్లకు డిమాండ్



వ్యవసాయ పనుల్లో కాడెద్ల వినియోగం తగ్గడంతో యంత్రాల వాడకం పెరిగింది. రైతులు అందరూ ఒకేసారి పనులు చేయించుకునేందుకు ముందుకు రావడంతో డిమాండ్ పెరిగింది.

– బెండే గంగాధర్, ట్రాక్టర్ యాజమాని, వద్దాడి

# సబ్సిడీ పథకాలకు మంగళం



సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

- రైతుబంధు రాకతో అన్నింటికీ బ్రేక్
- ఇబ్బంది పడుతున్న చిన్న, సన్నకారు రైతులు



ఈఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు సంతోష్‌రెడ్డి, తాంసి మండల రైతు ఐదు ఎకరాల సొంత భూమితో పాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ప్రతీ ఏటా పత్తితో పాటు సోయా సాగు చేస్తాడు. గతంలో 50 శాతం సబ్సిడీపై సోయా విత్తనాలను ప్రభుత్వం అందచేసేది 8 బ్యాగులకు సోయా విత్తనాలకు రూ. 12 వేలకే వచ్చేవి. ప్రస్తుతం సబ్సిడీ ఎత్తివేయడంతో అదనంగా రూ. 12 వేలు పెట్టుబడులు పెరిగాయి.

**ఇచ్చోడ:** కోటి ఆశలతో రైతులు వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. మృగశిర కార్తె ప్రారంభంతో జిల్లా వ్యాప్తంగా రైతులు పొలం బాటపట్టనున్నారు. రైతుబంధు రాకతో సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ, పనిముట్లు కనుమరగయ్యాయి. దీంతో పంటల సాగు రైతుకు భారంగా మారుతోంది.

**యంత్రలక్ష్మికి బ్రేక్..**

రైతులు ఆధునిక వ్యవసాయం చేసేందుకు సాగులో యాంత్రికరణ పెంచేందుకు యంత్రలక్ష్మి పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా చిన్న సన్నకారు రైతులకు సబ్సిడీపై రోటోవేటర్లు, నాగళ్లు, పవర్ స్ప్రేలు ప్రభుత్వం అందించేది. ఈ పథకానికి ప్రభుత్వం బ్రేక్ వేయడంతో రైతులు పనిముట్లు సైతం బయట మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది.

**బీమాకు మంగళం..**

**జిల్లాలోని రైతుల వివరాలు..**

| | |
|---|---|
| 1 నుంచి 4 ఎకరాల లోపు రైతులు | 1,16,320 |
| 4 నుంచి 8 ఎకరాల లోపు రైతులు | 78, 643 |
| 8 ఎకరాల పైన ఉన్న రైతులు | 14,611 |
| మొత్తం రైతుల సంఖ్య | 2,09,574 |

వాతావరణ ఆధారిత పంటల బీమా పథకానికి గత ప్రభుత్వం మంగళం పాడింది. ప్రతీ ఏటా పత్తి పండిస్తున్న రైతులు అతివృష్టి, అనావృష్టి కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారు. బీమా పథకాలను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశ పెట్టాయి. దీంతో పంటలు నష్టపోయిన రైతులు కొంత ఊరట కలిగింది. కానీ గత మూడేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించక పోవడంతో ఈ పథకం నిలిచిపోయింది.

**రద్దయిన పావులా వడ్డీ..**

పంటలపై బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు మార్చి 30 లోపు చెల్లించిన వారికి గతంలో పావలా వడ్డీ మాత్రమే వసూలు చేసే వారు. మిగితా వడ్డీ రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించేది. కానీ ప్రభుత్వం గత మూడు సంవత్సరాల నుంచి ఈ పథకాన్ని రద్దు చేసింది. దీంతో రైతులకు పంట రుణాలపై వడ్డీ భారం తప్పడం లేదు.

#### రైతు పథకాలను పునరుద్ధరించాలి



సబ్సీడీ పథకాలన్నింటిని రద్దు చేయడంతో జిల్లా వ్యాప్తంగా చిన్న సన్నకారు రైతులపై అదనంగా భారం పడుతోంది. విత్తనాలు కొనుగోళ్లతో పాటుగా, వ్యవసాయ పనిముట్లు కొనుగోళ్లు చేయడంతో నష్టపోతున్నారు.

– సంగెం బొర్రన్న, రైతుస్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు

#### ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



**ఇచ్చోడ:** మండలంలోని మాన్కపూర్ వద్ద విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది, ఒక్కవైపు వంగిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉంది. రానున్న వర్షాకాలంలో గాలులకు పడిపోయే ప్రమాదం ఉందని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు ముందుస్తుగా స్తంభాన్ని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

# రైతులు ఆందోళన చెందవద్దు



స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి



విత్తనాల ప్యాకెట్లు అందజేస్తున్న తహసీల్దార్

**కైలాస్‌నగర్:** రైతులు విత్తనాల విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని పలు విత్తన దుకాణాలను సందర్శించారు. రైతులకు విత్తనాలు అందుతున్న తీరును పరిశీలించారు. దుకాణాల్లోని పత్తి విత్తన ప్యాకెట్ల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రైతులు కోరుతున్న రాశీ 659 విత్తనాలతో పాటు ఇతర బ్రాండెడ్ విత్తనాలు సైతం డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయన వెంట డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, ఎస్టీ సెల్ చైర్మన్ ఆనంద్‌రావు, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, ఖయ్యూం, చంటి, తదితరులు పాల్గొన్నారు.

**మహారాష్ట్ర రైతులకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు**

**తాంసి:** మహారాష్ట్రకు చెందిన రైతులకు విత్తనాలు విక్రయించి, విత్తనాల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ లక్ష్మీ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన విక్రయాలను పరిశీలించి, రైతులకు అందజేయాలని సూచించారు. స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. అధిక ధరలకు పత్తి విత్తనాలు విక్రయించవద్దని సూచించారు. వారి వెంట ఏఈవోలు శివప్రసాద్, సుప్రియ, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, తదితరులు ఉన్నారు.

**అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు**

**తలమడుగు:** పత్తి విత్తనాలు కొరత సాకుతో అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ రాజమోహన్, ఏవో మహేందర్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని సుంకిడి గ్రామంలో రైతులకు పత్తి విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నిబంధనలు పాటించని డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేయడం జరుగుతుందన్నారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు.

#### దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో నాయకులు

**బోథ్:** నిర్మల్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో బోథ్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నిర్మల్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎలుక రాజు, శ్రీధర్ రెడ్డి, మేడిచెల్మ ప్రవీణ్, స్వామి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

# డీపీఆర్వోపై కలెక్టర్‌కు జర్నలిస్టుల ఫిర్యాదు

**కైలాస్‌నగర్:** జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి (డీపీఆర్వో) తిరుమలపై పలువురు జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు సోమవారం ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలిసి డీపీఆర్వో తీరును వివరించారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు సంబంధించి మీడియాకు ఎలాంటి సమాచారం అందించడం లేదని, దీంతో వాటిని కవరేజ్ చేయడం ఇబ్బందిగా మారుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉదయం జరిగిన కార్యక్రమాన్ని సైతం రాత్రికి పంపిస్తున్నారని, వాటిలో సరైన సమాచారం ఉండడం లేదన్నారు. కార్యక్రమాల్లో పాల్గొన్న అధికారుల పేర్లు కూడా రాయడం లేదని తెలిపారు. ఎదైనా సమాచారం కోసం ఫోన్ చేస్తే కూడా స్పందించడం లేదని కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ ఈవ్యవహారంపై జిల్లా అడిషనల్ కలెక్టర్‌తో విచారణ చేయిస్తానని హామీనిచ్చినట్లుగా జర్నలిస్టులు ఎం.సురేశ్, ఏరే సుధాకర్, ఎస్.నరేశ్ తెలిపారు.

# గురుకుల ప్రారంభానికి ఆటంకాలు



బేలలో ప్రారంభం కాని బీసీ గురుకులం

- రెండేళ్లుగానే మావలలోనే నిర్వహణ
- మౌలిక వసతుల ఏర్పాట్లలో జాప్యం

**బేల:** బేలలో బీసీ గురుకులం ప్రారంభానికి ఆటంకాలు ఎదురౌతున్నాయి. మండలానికి మోడల్, ఇతర ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లు లేకపోవడంతో గత ప్రభుత్వం హయాంలో మూడేళ్ల క్రితం మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులం(బాలురు) మంజూరైంది. ప్రైవేటు, ప్రభుత్వ భవన సముదాయాలు అందుబాటులో లేకపోవడంతో జిల్లా కేంద్రానికి అనుసంధామైన మావలలోని ఓ ప్రైవేట్ భవనంలో గురుకుల పాఠశాలను ప్రారంభించారు. దీంతో రెండేళ్లుగా అక్కడే కొనసాగుతోంది. మరోవైపు మండల కేంద్రంలో 18నెలల క్రితం భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. భవనం సిద్ధమవుతున్న క్రమంలో చిన్న, చిన్న మౌలిక వసతుల కల్పనలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

**రెండేళ్లుగా మావలలోనే..**

2022– 23విద్యా సంవత్సరంలో మావలలో బీసీ గురుకులం పాఠశాలలో 5, 6, 7 తరగతుల నిర్వహణను సైతం గురుకులం సొసైటీ ప్రారంభించింది. ఈక్రమంలోనే గత విద్యా సంవత్సరం 8వ తరగతి వరకు తరగతులను ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం మరో తరగతి 9వ తరగతి నిర్వహణ ఉండనుంది. ఒక్కొక్క తరగతిలో 80 చొప్పున సీట్లు కేటాయింబడ్డాయి. ఆన్‌లైన్ దరఖాస్తులు, రాత పరీక్షల ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నారు.

**మౌలిక వసతులు కరువు..**

బేలలో 18 నెలల క్రితం లీజు తాలుకు గురుకులం నూతన భవనం నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటికీ, ఇంకా అన్ని పనులు పూర్తికాలేదు. గతంలోనే గురుకులం ప్రారంభించాల్సి ఉండగా.. మౌలిక వసతుల ఏర్పాట్లలో జాప్యం జరుగుతోంది. తరగతి గదులు, ల్యాబ్, వంటగది, డైనింగ్ హాల్, డార్‌మెంట్రీ మొత్తం గదులు 25 ఉన్నాయి. తరగతి గదుల్లో విద్యా బోధన కోసం గ్రీన్ బోర్డులు ఇంకా ఏర్పాటు చేయలేదు. కిటికీలు, తలుపులు బిగించలేదు. ఫ్యాన్లు, లైట్లు బిగించలేదు. స్నానాల గదుల పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రత్యేక పర్యవేక్షణలో తాగునీరు ప్లాంట్ ఏర్పాటు చేయలేదు. మైదానం చదును, సీసీ ఫ్లాట్‌ఫారం పనులు ఇంకా చేపట్టాల్సి ఉంది. భవనం వెనుక వైపు ప్రహారీ నిర్మాణం పనులు పెండింగ్ ఉన్నాయి. ఈ పనులన్నీ ఈనెల 12లోపు పూర్తయ్యే అవకాశం లేదు. దీంతో గురుకుల పాఠశాల తరగతుల ప్రారంభం ఎప్పుడు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

#### వసతుల కల్పనలో జాప్యం



బేలలో గతేడాది మహాత్మా జ్యోతి బాపులే గురుకులం పాఠశాల ప్రారంభించాలి. నూతన భవన నిర్మాణం పూర్తయినప్పటికీ తలుపుల బిగింపు, విద్యుదీకరణ, తాగునీరు, మౌలిక వసతుల ఏర్పాట్లలో జాప్యం జరుగుతోంది. చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి.

– గోరే విశాల్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు

#### అధికారులు స్పందించాలి



బేలలో సిద్ధమవుతున్న గురుకులం పాఠశాల ప్రారంభంపై అధికారులు స్పందించాలి. గత విద్యా సంవత్సరం ప్రారంభించాల్సి ఉంది. అయినా.. ప్రారంభం కాలేదు. మౌలిక వసతుల ఏర్పాట్లను త్వరితగతిగా పూర్తి చేయించాలి. అధికారులు స్పందించి అన్ని వసతులు కల్పించాలి.

– బిర్జువార్ వినోద్, పోషకుడు, బేల

# 'అసమర్థ పాలనతో రాష్ట్రంలో కరువు'



మాట్లాడుతున్న జోగు రామన్న

**ఆదిలాబాద్‌టౌన్:** కాంగ్రెస్ అసమర్థ పాలనతో రాష్ట్రంలో కరువు నెలకొందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ జెండా ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరువు కటాక్షాల్లో కూరుకుపోతుందని మండిపడ్డారు. మాజీ సీఎం నాయకత్వంలో రైతులు ఇలాంటి ఇబ్బంది లేకుండా చూశామన్నారు. రైతుబంధు, రైతు బీమా అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, విజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, సాజిదొద్దీన్, యూనుస్ అక్బాని, సలీం పాషా, కస్తాల ప్రేమల, కరుణ, తులసీ పాల్గొన్నారు.

#### ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



ధాన్యాన్ని తరలిస్తున్న నిర్వాహకులు

**ఖానాపూర్:** మండలంలోని సత్తన్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో సత్తన్‌పల్లితోపాటు పాత ఎల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాల్లో కొనుగోళ్లు సోమవారంతో ముగిశాయి. ఇప్పటి వరకు సత్తన్‌పల్లిలో 315 మంది రైతుల నుంచి 23465 బస్తాలు, పాత ఎల్లాపూర్‌లో 526 మంది నుంచి 46686 ధాన్యం బస్తాలు కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. 99 శాతం ధాన్యం తరలించామని, ఇంకా కొన్ని తరలించాల్సి ఉందని తెలిపారు.